సాక్షి
బాపట్ల
బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025



ఈవీఎం గోదాములో తనిఖీ

నరసరావుపేట: స్థానిక మార్కెట్ యార్డు లోని ఈవీఎంలు భద్రపర్చిన గోదామును పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం తనిఖీ చేశారు.



బీ ఫార్మసీ పరీక్ష కేంద్రాల్లో తనిఖీ

పెదకాకాని(ఏఎన్‌యూ): ఏఎన్‌యూ పరిధిలో బీ ఫార్మసీ (రెగ్యులర్, సప్లమెంటరీ) పరీక్ష కేంద్రాలను మంగళవారం పీజీ. వృత్తివిద్య కోర్సు పరీక్షల సమన్వయకర్త ఎం.సుబ్బారావు తనిఖీ చేశారు.




కోటి లింగాల క్షేత్రంలో చండీహోమం

ఫిరంగిపురం: వేమవరం గ్రామంలోని కోటి లింగాల క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం మహా కాళీ మాతకు చండీహోమం నిర్వహించారు.

కృష్ణానదికి వరద ఉద్ధృతి

- నదిలో క్రమక్రమంగా పెరుగుతున్న నీటి ప్రవాహం
- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన అధికారులు
- లోతట్టు ప్రాంతాలలోకి భారీగా చేరిన వరద నీరు
- ముంపు ప్రాంత ప్రజల కోసం పునరావాస కేంద్రాలు సిద్ధం
- క్షేత్రస్థాయిలో పర్యటించిన జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్
- సహాయక చర్యలపై అధికారులు, సర్పంచ్‌లతో సమావేశం



కొల్లూరు సమీపంలో వరద నీటిలో మునిగిన ఇటుక బట్టీలు

కొల్లూరు/ భట్టిప్రోలు: కృష్ణానదిలో వరద ఉద్ధృతి పెరుగుతోంది. క్రమక్రమంగా నదిలో నీటి మట్టం ఎక్కువ అవుతోంది. మంగళవారం ప్రకాశం బ్యారేజ్ నుంచి 3,97,250 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేసిన నేపథ్యంలో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజ్ ఎగువనున్న ప్రాజెక్టులతోపాటు తెలంగాణ ప్రాంతంలోని మున్నేరు, ఇతర వాగులు నుంచి వరద నీరు అధికంగా వస్తోంది. దీంతో అధికారులు దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నదిలో గణనీయంగా వరద నీరు పెరుగుతుండటంతో పెసర్లంక నక్కపాయ గండి, పోతార్లంక – గాజుల్లంక ప్రాంతాలలోని చిన్నరేవు, నది ఒడ్డుకు ఏర్పడిన కోతల ద్వారా వరద నీరు భారీగా లోతట్టు ప్రాంతాలలోకి ప్రవేశించి గ్రామాలను చుట్టుముట్టింది. వరద తీవ్రత అధికమవుతుండటంతో చింతర్లంక, పోతార్లంక, గాజుల్లంక, దోనేపూడి కరకట్ట దిగువున ఉన్న పంట పొలాలలో సాగులో ఉన్న అరటి, కంద, పసుపు, కూరగాయల పంటలు ముంపు బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. కొల్లూరు, గాజుల్లంక, పెసర్లంక ప్రాంతాలలోని పల్లపు భూములలోకి వరద నీరు చేరడంతో ఇటుక బట్టీలు ముంపునకు గురయ్యాయి. దోనేపూడి చిన రేవు చప్టా పై నుంచి వరద నీటి ప్రవాహం అధికమవడంతో మండలంలోని 10 గ్రామాలకు చెందిన ప్రజలు గాజుల్లంక, భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామాల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. వరద తీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో అధికారులు నది తీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. నదిలోకి పశువుల కాపరులు దిగరాదని, పిల్లలను నది వద్ద వెళ్లనీయకూడదని, ఈతకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు.

పునరావాస కేంద్రాలు గుర్తింపు

వరద తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు తెలిపారు. కొల్లూరు మండలంలోని వరద ప్రభావిత 21 గ్రామాలలో ఉన్న ప్రజల కోసం 13 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. కొల్లూరులో 8, అనంతవరం, చిలుమూరు, ఈపూరు, దోనేపూడి, భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామాలలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో వీటిని సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఇక్కడ అనివసతులు ఉండేలా చూస్తామన్నారు. మంగళవారం ఆయన ఆయా కేంద్రాలను పరిశీలించారు. విద్యుత్తు వసతి, తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు రామారావు, చిట్టిబాబు ఉన్నారు.

కలెక్టర్‌కూ తప్పని 'కరకట్ట' కష్టం

కరకట్ట ప్రయాణ కష్టాలు జిల్లా కలెక్టర్‌కు సైతం తప్పలేదు. కొల్లూరు వద్ద సుమారు రెండు కిలోమీటర్ల మేర కరకట్ట మార్గం పూర్తిగా దెబ్బతింది. నిరంతరం ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ మార్గంలో వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. ఇరువైపులా సుమారు 15 అడుగుల లోతట్టు ప్రాంతం, పశ్చిమ బ్యాంక్ కెనాల్‌తో ఉన్న మార్గంలో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రాణాలు గాలిలో కలసిపోయే ప్రమాదం వెన్నాడుతోంది. రహదారి అధ్వానంగా మారడంతో ఎదురుగా ఏదైనా వాహనం వస్తే పక్కకు తప్పుకొనే అవకాశం సైతం లేదు. మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ కొల్లూరు కరకట్ట ప్రాంతానికి వచ్చారు. ఎదురుగా వాహనాలు రావడంతో కలెక్టర్ ప్రయాణిస్తున్న వాహనం ముందుకు సాగడానికి తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది.



కొల్లూరులో ఓ ప్రయివేటు పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో సౌకర్యాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు



కొల్లూరు కరకట్టపై వాహనం ఎదురు రావడంతో అతికష్టంపై వెళుతున్న కలెక్టర్ ప్రయాణిస్తున్న కారు

ప్రాణ నష్టం ఉండొద్దు



దోనేపూడి చప్టా వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

కృష్ణా నదికి వరద అధికంగా వస్తే ప్రాణ నష్టం జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో పరీవాహక లంక గ్రామాలైన బాపట్ల జిల్లా పరిధిలోని భట్టిప్రోలు, కొల్లూరు, రేపల్లె మండలాలకు చెందిన సర్పంచులు, అధికారులతో సోమవారం కలెక్టర్ సమావేశం అయ్యారు. భట్టిప్రోలు మండల తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల సముదాయంలోని సమావేశపు హాలులో ఈ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వరదల సమయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగునీరు, భోజనాలు, పడవల సంఖ్య పెంచాలని సర్పంచులు కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా కరకట్టపై చెట్లను తొలగించాలని పేర్కొన్నారు. వరద తగ్గిన తరువాత పొలాల్లో నీరు బయటకు వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని తెలిపారు. దోనేపూడి నుంచి పెనుమూడి వరకు కరకట్టను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. 3 లక్షల క్యూసెక్కులు బ్యారేజి వద్ద వదిలితే కొల్లూరు మండలం దోనేపూడి చప్టా మునిగిపోతుందని వారు గుర్తుచేశారు. ఆ సమయంలో పోతార్లంక, తోకలవానిపాలెం, తిప్పలకట్ట, కిష్కింధపాలెం గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. వెంటనే వంతెన నిర్మించాలని తోకలవానిపాలెం సర్పంచ్ కృష్ణమోహన్ కోరారు. సమావేశంలో రేపల్లె ఆర్డీవో ఎస్. రామలక్ష్మి, భట్టిప్రోలు తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొల్లూరు మండలంలోని దోనేపూడి, కొల్లూరు ప్రాంతాలలో పర్యటించిన జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

న్యూస్‌రీల్

'ఎన్జీవో' ఎన్నికల షెడ్యూల్ విడుదల




బాపట్ల: ఎన్జీవో బాపట్ల, రేపల్లె యూనిట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనట్లు జిల్లా ఛైర్మన్ పి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు షెడ్యూల్‌ను బాపట్ల ఎన్జీవో హోంలో మంగళవారం అందుబాటులో ఉంచారు. పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల అధికారిగా సీహెచ్ శేషుబాబు వ్యవహరిస్తారని తెలిపారు. 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఓటర్ల నమోదు, అక్టోబరు 3 వ తేదీన నామినేషన్లు, 10వ తేదీన ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రతిని బాపట్ల తాలూకా యూనిట్ కార్యదర్శి జి.ఇస్సాకు నోటీసు బోర్డుపై అంటించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బాపట్ల కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

బాలా త్రిపుర సుందరీదేవిగా బాల చాముండేశ్వరి దేవి దర్శనం



అమరావతి: ప్రముఖ శైవ క్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న శ్రీబాల చాముండిక సమేత అమరేశ్వరాలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మంగళవారం బాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో బాల చాముండేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలలో భాగంగా చండీ, రుద్రహోమాలు, శ్రీచక్రార్చన నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖర శర్మ బాల త్రిపురసుందరి దేవి అలంకార విశిష్టతను వివరించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసుర మర్దని అమ్మవార్లకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో రెండో రోజు అమ్మవారికి వారాహిదేవి అలంకారం చేసి, ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలలో పాల్గొన్నారు.

నిరుపయోగంగా స్వాగత హోర్డింగులు



తాడేపల్లి రూరల్: విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో జరిగే దేవి నవరాత్రుల కోసం వచ్చే భక్తులకు స్వాగతం పలుకుతూ ప్రతి సంవత్సరం పలుచోట్ల దేవదాయ శాఖ అధికారులు హోర్డింగులు ఏర్పాటు చేస్తారు. ఇలా తయారు చేయించిన హోర్డింగులు మంగళవారం కూడా సీతానగరం సీతా భవనంలోనే గోడలకు ఆనించి దర్శనమిచ్చాయి. ఏటా వేడుకలకు ముందుగానే వీటిని ప్రకాశం బ్యారేజ్ వద్ద ఏర్పాటు చేసేవారు. ఈ సారి మాత్రం నవరాత్రులు ప్రారంభమై రెండు రోజులు అవుతున్నా ఇక్కడే ఉండడంతో ఆ శాఖ నిర్లక్ష్యంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



తాడికొండ: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 25వ తేదీన వెలగపూడిలో రాష్ట్ర సచివాలయం సమీపంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేసే కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను మంగళవారం పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ , విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు, జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌లు పరిశీలించారు. ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ ఆరిఫ్ ఆఫీజ్, సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవలు వారి వెంట ఉన్నారు. జిల్లాల నుంచి వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

పకడ్బందీగా ఓటరు క్లెయిమ్‌ల విచారణ



నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

చీరాల టౌన్: చీరాల అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు క్లెయిమ్‌ల విచారణ పకడ్బందీగా నిర్వహిస్తున్నామని ఈఆర్‌ఓ, ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు తెలిపారు. మంగళవారం చీరాల తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీఓ దీనికి సంబంధించి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చీరాల నియోజకవర్గంలో అర్జీలు పెండింగ్‌లో లేకుండా బీఎల్‌వోలు సమర్థంగా పని చేస్తున్నారని చెప్పారు. నాయకులు తమ బూత్ ఏజెంట్లతో విచారణ చేయించుకోవాలని సూచించారు. అర్జీని నిశితంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో అభ్యంతరాలు లేకుండా విచారణ చేస్తున్నారని తెలిపారు. ఇటీవల మృతి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతీ బీఎల్‌వో వారికి కేటాయించిన బూత్‌లోని ఓటర్ల పూర్తి వివరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. క్లెయిమ్‌ల విచారణలో ఈసీ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. సమస్యలు ఉంటే తనకుగానీ, ఏఈఆర్వోలకుగానీ చెప్పాలని కోరారు. పలు పార్టీల నాయకులు లేవనెత్తిన సందేహాలను ఆర్డీఓ నివృత్తి చేశారు. పోలింగ్ కేంద్రాల మార్పునకు సంబంధించి నాయకులు పలు సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ, మున్సిపల్ టీపీఓ శ్రీనివాసరావు, డీటీ సుశీల తదితరులు పాల్గొన్నారు.


రైతులకు అందుబాటులో యూరియా

బాపట్ల: జిల్లాలో యూరియా 171.600 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు తీసుకోవచ్చునని పేర్కొన్నారు. మంగళవారం బాపట్ల జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్‌ల ద్వారా 289.205 మెట్రిక్ టన్నుల యూరియాను 2,385 మంది రైతులకు పంపిణీ చేశామని వివరించారు. ఇంకా 171.600 మెట్రిక్ టన్నుల అందుబాటులో ఉందని తెలిపారు.

స్వచ్ఛ బాపట్ల జిల్లాకు కృషి చేయాలి

స్వచ్ఛ బాపట్ల జిల్లాగా రూపొందేలా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి స్వచ్ఛ భారత్, స్వచ్ఛతాహీ సేవ, ఈకేవీసీ, తల్లికి వందనం, మన మిత్ర, సచివాలయ సేవలు, ఇంటింటి నుంచి చెత్త సేకరణ వంటి అంశాలపై అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. బాపట్ల, చీరాల, రేపల్లె, అద్దంకి మున్సిపాలిటీలకు అవార్డులు సాధించేలా కమిషనర్లు పనిచేయాలని ఆదేశించారు. ప్రతి మంగళవారం దీనిపై సమావేశం ఉంటుందని తెలిపారు.

క్రీడాపోటీల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ తదితరులు

చీరాల టౌన్: రెవెన్యూ అసోసియేషన్ బాపట్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 10, 11వ తేదీల్లో బాపట్లలో జిల్లా స్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రీడా పోటీలు, సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నారు. క్రీడల్లో చీరాల డివిజన్ పరిధిలోని ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం తమ కార్యాలయంలో ఏపీ రెవెన్యూ అసోసియేషన్ చీరాల డివిజన్ అధ్యక్షుడు, తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణతో కలసి ఆయన బ్రోచర్ ఆవిష్కరించారు. నిత్యం పని ఒత్తిడి ఉండే రెవెన్యూ ఉద్యోగులకు కాస్త ఉపశమనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పోటీలను కలెక్టర్ ప్రారంభిస్తారని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సురేష్ బాబు, డివిజన్ కార్యదర్శి పీకా సురేష్, జిల్లా క్రీడల కార్యదర్శి డి.అర్జున్, ప్రతినిధులు సత్యనారాయణ, ఆదినారాయణ, సీహెచ్ రమేష్, తేజ, నారాయణమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



మాంగల్య గౌరి అలంకరణలో బగళాముఖి

దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా చందోలు శ్రీ బగళాముఖి అమ్మవారు మంగళవారం భక్తులకు మాంగల్య గౌరి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పసుపుకుంకుమలు సమర్పించారు. వివాహ దోష నివారణ పూజలలో బాలికలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహా గౌరి, మహా చండీ హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. - కర్లపాలెం



కనుల పండువగా శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన జిల్లెళ్ళమూడి గ్రామంలోని అనసూయ దేవి (జిల్లెళ్ళమూడి అమ్మ వారు) దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బాల త్రిపురసుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారి దర్శనం చేసుకునేందుకు పరిసర గ్రామాలతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఏర్పాట్లను కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు. - బాపట్ల టౌన్

వేదమాతా నమోనమః

గాయత్రీదేవిగా దుర్గమ్మ దర్శనం

- సర్వ దర్శనం క్యూలైన్లు కిటకిట
- రూ.100, రూ.300 లైన్లలో కనిపించని రద్దీ
- ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వేదమాత గాయత్రీదేవిగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కొలువైన ఇంద్రకీలాద్రిపై దేవీశరన్నవ రాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజైన మంగళవారం దుర్గమ్మను శ్రీగాయత్రీదేవిగా అలంకరించారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు. వేకువజాము నుంచి ఉదయం ఆరు గంటల వరకు భక్తులతో అన్ని క్యూలైన్లు కిక్కిరిశాయి. అమ్మవారికి నిర్వహించే పలు ఆర్జిత సేవల్లో పాల్గొనే భక్తులు, ఉభయదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్జిత సేవల్లో పాల్గొనేందుకు కొండపైకి చేరుకోవడం ఇబ్బందికరంగా ఉందని పలువురు ఉభయదాతలు నేరుగా కలెక్టర్ లక్ష్మీశకు ఫిర్యాదు చేశారు. ఉదయం ఆరు గంటల తర్వాత సర్వ దర్శనం క్యూలైన్లలో భక్తుల రద్దీ కొనసాగింది. అయితే రూ.100, రూ.300 టికెట్ల క్యూలైన్లు ఖాళీగానే దర్శనమిచ్చాయి. రద్దీని కట్టడి చేసేందుకు పోలీసు, రెవెన్యూ అధికారులు భక్తులను రూ.100 క్యూలోకి అనుమతించారు. ఇక అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక ఖడ్గమాలార్చన, శ్రీచక్రనవార్చన, చండీయాగం, కుంకుమార్చనలో ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక కుంకుమార్చనను మొదటి షిప్టునకే పరిమితం చేశారు.

వీఐపీ దర్శనాలకు బ్రేక్

తొలి రోజున ఆలయ ప్రాంగణంలో ఇష్టానుసారంగా వీఐపీల పేరిట జరిగిన దర్శనాలకు మంగళవారం బ్రేక్ పడింది. ప్రొటోకాల్ ఉన్న వారికి మాత్రమే సీఎం గేటు, వీఐపీల పేరుతో వచ్చే వారిని గాలిగోపురం వద్ద ఉన్న క్యూలైన్ ద్వారానే ఆలయంలో అనుమతించారు. కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఉదయం లడ్డూ తయారీ పోటులను తనిఖీ చేశారు. ప్రసాదాల తయారీకి వినియోగిస్తున్న పిండి పదార్థాలు, పంచదార, నూనె, నెయ్యి, జీడిపప్పు నాణ్యతను పరిశీలించారు. రోజుకు ఎన్ని లడ్డూలు తయారు చేస్తున్నారు? మొదటి రోజు ఎన్ని విక్రయించారు? ఇంకా ఎన్ని నిల్వ ఉన్నాయన్న వివరాలను ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నిత్యం 2.50 లక్షల లడ్డూలను తయారీ చేసేలా దేవస్థానం మూడు లడ్డూ పోటులను సిద్ధం చేసిందని, ఉత్సవాల్లో 36 లక్షల లడ్డూలు అవసరమయ్యవుతాయని అంచనా వేశామని తెలిపారు. లడ్డూ విక్రయ కేంద్రాలను మంగళవారం నుంచి మరి కొన్నింటిని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. పలుచోట్ల ఈ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

దుర్గమ్మ సేవలో మహిళా మంత్రులు

వించిపేట(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల సన్నిధిలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో రెండో రోజు మంగళవారం శ్రీగాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మను రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, ఎస్.సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, బండారు శ్రావణి, గల్లా మాధవి, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ దర్శించుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు వేద పండితులు వేదాశీర్వచనం, ఆలయ ఈఓ శీనా నాయక్ అమ్మవారి చిత్రపటాలు అందజేశారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,400** గరిష్ఠం : రూ. **3,100**

మోడల్ ధర రూ. **2,700**

పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **00**

కొమ్ములు : **957** బస్తాలు

కనిష్ట :	గరిష్ట : (ధర రూ॥ల్లో)	మోడల్ :
00	00	00

కాయలు : **216** బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,500	10,500	10,500

మొత్తం అమ్మకాలు : **22.50** క్వింటాళ్లు

క్లుప్తంగా

సంధానకర్తలుగా పనిచేయాలి



నరసరావుపేట: పేదరికం లేని సమాజం కోసం పీ–4 ద్వారా బంగారు కుటుంబాలు, మార్గదర్శకులకు సంధానకర్తలుగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పనిచేయాలని జిల్లా అర్థగణాంకాధికారి పి.మాలతీదేవి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని గుర్రం జాషువా హాలులో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాలతీదేవి మాట్లాడుతూ పీ–4 యాప్ ద్వారా అర్హత కల్గిన బంగారు కుటుంబాలను గుర్తించి వారిని మార్గదర్శకులతో మ్యాపింగ్ చేయాలన్నారు. అర్హత, ఆసక్తిలేని వారిని తొలగించాలని సూచించారు. బంగారు కుటుంబాల అవసరాలను ఇద్దరు లేదా ముగ్గురు మార్గదర్శకులు తీర్చే అవకాశం ఇవ్వాలన్నారు. సహాయ సంచాలకులు డి.శ్రీనివాసరెడ్డి సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు.

రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ



నరసరావుపేట: అనంతపురంలో నవంబరు 7,8,9 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించే రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల కరపత్రాలను మంగళవారం కార్యాలయంలో కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ఆవిష్కరించారు. తీవ్ర పని ఒత్తిడిలో ఉంటూ రెవెన్యూ శాఖలో పనిచేసే గ్రామ రెవెన్యూ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారుల నుంచి డిప్యూటీ కలెక్టర్ల స్థాయి వరకు ఉద్యోగుల్లో ఉత్సాహం నింపేందుకు నిర్వహించే క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఉద్యోగులు అందరూ హాజరుకావాలని అసోసియేషన్ నాయకులు కోరారు. రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నమ్మించి.. నట్టేట ముంచేసి..

- రూ.వేలల్లో పెట్టుబడి పెడితే లక్షాధికారులు అవుతారంటూ ప్రచారం
- ఎల్‌ఎఫ్ వర్క్ మనీ యాప్ పేరుతో రూ.5 కోట్ల వరకు వసూలు
- నిర్వాహకుడు ఊరు విడిచి వెళ్లడంతో వెలుగులోకి భారీ మోసం



నిందితుడి ఇంటి వద్ద బాధితులు

నాగులుప్పలపాడు: యాప్‌లో నగదు జమ చేస్తే భారీగా లాభం వస్తుందని నమ్మించి ఆ ఊరి ప్రజలను నట్టేట ముంచాడో ప్రబుద్ధుడు. సుమారు 500 మందికిపైగానే రూ.5 కోట్లకుపైగా చెల్లించి మోసపోయారు. ఆ వ్యక్తి ఊరిలో కనిపించకపోవడంతో విషయం తెలిసి లబోదిబోమంటున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నాగులుప్పలపాడు మండలంలోని తిమ్మసముద్రం గ్రామానికి చెందిన తూతిక నాగాంజనేయులు అనే వ్యక్తి ఎల్‌ఎఫ్ వర్క్ మనీ పేరుతో ఉన్న యాప్‌లో పెట్టుబడి పెడితే రూ.లక్షల్లో లాభాలు వస్తాయని ఆశ చూపించాడు. గ్రామంలోని సుమారు 500 మంది నుంచి రూ.5 కోట్లకుపైగా వసూలు చేసి అందులో చేర్పించాడు. యాప్‌ను ఈ ఏడాది జనవరిలో నాగాంజనేయులుకు ఒడిశాకు చెందిన కొందరు వ్యక్తులు పరిచయం చేశారు. ఎవరైనా డిపాజిట్ చేస్తే నగదును బట్టి రోజువారీగా కొంత మొత్తం తొమ్మిది నెలలపాటు ఇస్తారని నాగాంజనేయులు నమ్మించాడు. రూ.2,400 డిపాజిట్ చేస్తే రోజుకి రూ.72 చొప్పున, రూ.6,000 చెల్లిస్తే రోజుకి రూ.350 చొప్పున, రూ.12,000 చెల్లిస్తే రోజుకి రూ.725 చొప్పున ఇస్తామని చెప్పి ప్రజలకు అలవాటు చేసి మొదట్లో తిరిగి చెల్లింపులు కూడా చేశారు. ఆశావాహులు పెరిగారని నమ్మకం కుదిరిన తరువాత రూ.24 వేలు, రూ.51,100 వంటి పెద్ద మొత్తాలను కూడా డిపాజిట్ చేయొచ్చని నమ్మబలికారు. ఎల్‌ఎఫ్ వర్కు పేరుతో చీరాల, ఇంకొల్లు ప్రాంతాల్లో కార్యాలయాలు కూడా తెరిచారు. ఈ మధ్య కాలంలో చీరాలలోని ఓ రిసార్టులో ఆర్భాటంగా పెద్ద అవగాహన సభ ఏర్పాటు చేశారు. వచ్చిన క్లైంట్లకు భారీ విందు కూడా ఇచ్చారు. దీంతో నమ్మిన జనం ఆగస్టు చివరి వారం, సెప్టెంబర్ మొదటి వారాల్లో అందిన కాడికి అప్పులు తెచ్చి రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టారు. నాగాంజనేయులు ఈ సంస్థకు చీరాల ఏరియా మేనేజర్‌గా పరిచయం చేసుకోవడంతో తిమ్మసముద్రం గ్రామంతో పాటు చీరాల, వేటపాలెం, పర్చూరు, ఇంకొల్లు ప్రాంతాల ప్రజలు తమ బంగారాలను సైతం తాకట్టు పెట్టి ఈ యాప్‌లో పెద్ద మొత్తంలో జమ చేశారు. ఈ నెల 13వ తేదీ నుంచి యాప్ ద్వారా డబ్బులు విత్‌డ్రా కావడం లేదు. నాగాంజనేయులు ఊరి విడిచి వెళ్లిపోవడంతోపాటు 2 రోజుల నుంచి అతని ఫోన్ పనిచేయడం లేదు. ఒక్కసారిగా గ్రామంలో అలజడి మొదలైంది. పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టారు.



మోసాలకు కారణమైన యాప్



యాప్‌నకు నగదు చెల్లించిన దృశ్యం



ఎల్‌ఎఫ్ పేరులో ఏర్పాటు చేసిన బ్యానర్

అప్పు చేసి మరీ జమ

బర్లీ పొగాకు వలన పూర్తిగా నష్టపోయిన తరుణంలో గ్రామంలో ఈ యాప్ ద్వారా ఎక్కువ మంది డబ్బులు సంపాదిస్తున్నారని సమాచారం వచ్చింది. అప్పు చేసి మరీ మా గ్రామానికి చెందిన యువకుడి ద్వారా రూ.51 వేలు జమ చేశాను. డబ్బులు వస్తే పొగాకు కూలీలకు నగదు చెల్లించొచ్చని ఆశతో పెట్టుబడి పెట్టా. తీరా చూస్తే యాప్ ద్వారా మోసం జరిగిందని గ్రహించాం.

– దేశబోయిన వెంకట్రావు, బాధితుడు

నాతోపాటు చేర్పించిన వారికీ నష్టం

యాప్ ద్వారా డబ్బులు వస్తున్నాయన్న ఆశతో నేను స్వయంగా రూ.2.60 లక్షల పెట్టుబడి పెట్టాను. నాకు తెలిసిన వారి ద్వారా మరో రూ.4 లక్షల వరకు పెట్టుబడి పెట్టించాను. చివరికి దారుణంగా మోసపోయాం.

– మాగులూరి రత్తయ్య, బాధితుడు

రసవత్తరంగా విజ్ఞాన్ జాతీయ చెస్ చాంపియన్‌షిప్



పోటీలలో పాల్గొన్న వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు

చేబ్రోలు: ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహిస్తున్న 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో మంగళవారం రెండో రౌండ్ ముగిసేసరికి 68 మంది క్రీడాకారులు తలో రెండు పాయింట్లతో అగ్రస్థానాన్ని పంచుకున్నారు. ఎక్కువమంది అగ్ర క్రీడాకారులు మూడో రౌండ్‌కి సులభంగా అడుగుపెట్టారు. మాజీ జాతీయ చాంపియన్ గ్రాండ్ మాస్టర్ సూర్యశేఖర్ గంగూలీ (పీఎస్‌పీబీ) టాప్ బోర్డులపై తొలి విజయాన్ని నమోదు చేశారు. గియూకో పియానో ఆరంభంలో, 19వ మూవ్‌లో యషద్ బంబేశ్వర్ (ఛత్తీస్‌గఢ్) చేసిన తప్పిదాన్ని గంగూలీ సద్వినియోగం చేసుకున్నారు. వరుసగా బిషప్, నైట్ త్యాగాలు చేసి పూర్తిగా ఆధిపత్యం సాధించిన గంగూలీ, 30వ మూవ్‌లో ప్రత్యర్థిని రాజీనామా చేయించారు.

– టాప్ సీడ్ జీఎం ఇనియన్.పి (తమిళనాడు), అధిరాజ్ మిత్రా(ఝార్ఖండ్)పై గెలుపొందాడు. వెటరన్ జీఎం కృష్ణన్ శశికిరణ్, హృషికేశ్ బానిక్ (పశ్చిమ బెంగాల్)పై గెలుపొందాడు. కొత్తగా గ్రాండ్ మాస్టర్ బిరుదు పొందిన ఎస్.రోహిత్ కృష్ణ (తమిళనాడు), దేవర్ష భోర్కటేరియా (గుజరాత్)పై గెలుపొందాడు. జీఎం.ఎం.ఆర్.లలిత్ బాబు (ఆంధ్రప్రదేశ్), అయుష్ రవికుమార్ (తమిళనాడు)పై ఆసక్తికర పోరులో గెలిచారు. కర్ణాటక ఐఎం వియాని ఆంటోనియో డి కున్హాను ఆంధ్ర యువకుడు అందమాల హేమల్ వర్షన్ డ్రాలో కట్టేశారు. మూడో రౌండ్‌లో టాప్ బోర్డులపై మరింత రసవత్తర పోటీలు జరగనున్నాయి.

హత్య కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

మంగళగిరి: ఆరు సంవత్సరాల క్రితం నగర పరిధిలోని కొత్తపేటలో జరిగిన హత్య కేసు ఘటనలో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ 5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. మంగళగిరి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... 2019, ఆగస్టు 2 మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం గ్రామానికి చెందిన బొద్దులూరి వెంకటరమణ(43) కొత్తపేటకు చెందిన మోటుకూరి భాస్కరరావు మద్యం మత్తులో ఘర్షణకు పాల్పడ్డారు. అనంతరం చుట్టూ వున్నవారు వారించడంతో ఎవరి ఇళ్లకు వారు వెళ్లారు. అయితే వెంకటరమణ కొత్తపేటలోని భాస్కరరావు నివాసానికి వెళ్లి తనపై ఎందుకు ఘర్షణకు దిగావని వాగ్వివాదానికి దిగాడు. దీంతో ఆగ్రహం చెందిన భాస్కరరావు తన ఇంటిలోని కుట్టుమిషన్‌పై వున్న కత్తెరతో వెంకటరమణను పొట్టలో పొడవగా గాయాలపాలైన వెంకటరమణ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హత్య ఘటనపై అప్పటి ఎస్‌ఐ సీహెచ్ రవిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడు భాస్కరరావును కోర్టులో హాజరుపరచి చార్జిషీటు దాఖలు చేశారు. గుంటూరు జిల్లా మూడవ ఏడీజే కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముబీన బేగం వాదనలు వినిపించగా సదరు కేసును విచారణ జరిపిన జిల్లా మూడవ ఏడీజే కోర్టు జడ్జి సి.వెంకట నాగ శ్రీనివాసరావు ముద్దాయి భాస్కరరావుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వచ్చింది.

అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యపై చర్చించాలి

కలెక్టరేట్ ముందు ఏఐవైఎఫ్ నాయకుల నిరసన

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యలపై చర్చించాలని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, అదేవిధంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి మంజూరు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా షేక్ వలి మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్రలో భాగంగా ఏటా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి విడుదల చేస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. అదేవిధంగా అధికారం వచ్చిన 100 రోజుల్లో 107–108 జీఓలు రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక మోసం చేశారని మండిపడ్డారు, పైగా మెడికల్ కాలేజీ లను పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణకు ఇవ్వడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అన్ని శాఖల్లో పోస్టుల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేసి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇవ్వాలని తీర్మానం చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, నగర అధ్యక్ష కార్యదర్శులు శ్రీను, మరియదాసు గుంటూరు జిల్లా కార్యదర్శి యస్వంత్ నగర కార్యదర్శి బన్నీ సాయి, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు గోపి, నవీన్, రెహ్మాన్, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె



జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న డాక్టర్ గోపీనాథ్

బాపట్ల: ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 25వ తేదీ నుంచి సమ్మె చేపట్టనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టరు ఎం.గోపీనాథ్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టరు వి.వినోద్‌కుమార్‌ను, జిల్లా వైద్యాధికారిణి డాక్టరు విజయమ్మను మంగళవారం కలిసి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాలల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇన్–సర్వీస్ కోటాను పునరుద్ధరించాలని, టైమ్ బౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలని, గిరిజన ప్రాంతాల్లో పని చేసే వారికి అలవెన్సు మంజూరు చేయాలని, నోషనల్ ఇన్‌క్రిమెంట్స్ మంజూరు చేయాలని కోరారు. చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రాం కింద వైద్యులకు రూ.5 వేలు ఇవ్వాలన్నారు. వైద్యులకు కచ్చితమైన పనిగంటలు, స్థిరమైన వారాంతపు సెలవులు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో డాక్టరు పవన్‌చైతన్య తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మందికి గాయాలు



కొప్పరపాడు వద్ద ప్రమాదానికి గురైన వాహనం

బల్లికురవ: మినీ వ్యాన్‌ను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న 9 మంది గాయాలపాలయ్యారు. ఈ ఘటన మంగళవారం నార్కెట్‌పల్లి– మేదరమెట్ల నామ్ రహదారిలో కొప్పరపాడు గ్రామ శివాలయం సమీపాన జరిగింది. అద్దంకి మండలం చినకొత్తపల్లి గ్రామానికి చెందిన చింతంరెడ్డి అంకిరెడ్డి తన కుమారుడి పుట్టెంట్రుకలు తీయించేందుకు పల్నాడు జిల్లా అడిగొప్పుల అమ్మవారి సన్నిధానానికి 20 మందితో కలిసి వాహనంలో వెళ్లారు. తిరిగి వస్తుండగా కొప్పరపాడు గ్రామ సమీపంలోని చేపల చెరువుల నుంచి వస్తున్న లారీ రోడ్డు క్రాస్ చేస్తూ వ్యాన్‌ను ఢీకొట్టింది. జయరామిరెడ్డి, వెంకటరెడ్డి, ప్రభాకరరెడ్డి, పేరమ్మ, వెంకటేశ్వరరెడ్డి, అంజిరెడ్డి, మాగంటి రామాంజనేయులు, మిర్యాల సీతారామయ్య తదితరులు గాయాలపాలయ్యారు. స్థానికులు క్షతగాత్రులను నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

బంగారంతో పరారీ.. కేసు నమోదు

చీరాల అర్బన్: నగలు చేయించుకునేందుకు ఇచ్చిన బంగారంతో ఓ వ్యక్తి ఊరు వదిలి వెళ్లిపోయాడు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం చీరాల రూరల్ ఈపురుపాలెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. ఈపురుపాలెం రామాలయంల వద్ద నివాసం ఉంటున్న బూదాటి మల్లికార్జునరావు స్వర్ణకార వృత్తి చేస్తున్నాడు. నమ్మకంగా ఉండటంతో పలువురు బంగారం నగలు చేయిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన సూరగాని మనోజ్ఞ ఆరు నెలల క్రితం 15 సవర్ల పాత బంగారం ఇచ్చారు. నగలు అడుగగా దాటవేస్తూ వచ్చాడన్నారు. కొద్దిరోజులుగామల్లికార్జునరావు స్థానికంగా ఉండడం లేదని తెలియడంతోబాధితుడు మంగళవారం ఈపురుపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చీటింగ్ కేసు నమోదు చేశారు. మరికొందరు కూడా నగలు తయారు చేయమని డబ్బులిచ్చినట్లు సమాచారం.

మిత్రుడిని హతమార్చిన నిందితుల అరెస్ట్



విలేకర్ల సమావేశంలో డీఎస్పీ హనుమంతరావు, రూరల్ సీఐ సుబ్బానాయుడు

చిలకలూరిపేట: స్నేహితుడిని తలపై రాడ్‌తో కొట్టి, గొంతును తాడుతో బిగించి క్రూరంగా హత్య చేసిన ముగ్గురు నిందితులను చిలకలూరిపేట రూరల్ సర్కిల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. చిలకలూరిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నరసరావుపేట డీఎస్పీ ఎం హనుమంతరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన తాడిబోయిన గోపి(32) గతంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసేవాడు. అతను దక్షిణామూర్తి సెలిస్టియాన్ క్రియేషన్స్ బ్యానర్‌పై షార్ట్‌ఫిలింలు, మిషన్ మంగళాద్రి పేరుమీద వెబ్‌సిరీస్‌లు తీయడం ప్రారంభించాడు. ఈ క్రమంలోనే ఈ ఏడాది జూన్ 25వ తేదీన గుర్తుతెలియని మృతదేహం యడ్లపాడు సర్వీస్ రోడ్డు కాల్వలో కాలిపోతున్న స్థితిలో కనిపించింది. పోలీసుల విచారణలో అది తాడిబోయిన గోపిదిగా గుర్తించారు. చనిపోయిన గోపికి గుంటూరుకు చెందిన ఆఫ్రిన్ అనే ఆమె ద్వారా వాళ్ల తమ్ముడు, గుంటూరులోని సుద్దపల్లిడొంకలో నివాసం ఉండే షేక్ ఇమ్రాన్ పరిచయమయ్యారు. కొంతకాలానికి గోపి, ఇమ్రాన్‌ల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో గోపిని హత్యచేయాలని నిర్ణయించుకున్నాడు. ఇమ్రాన్‌కు స్నేహితులైన గుంటూరు రామిరెడ్డిపేటకు చెందిన షేక్ రియాజ్, నల్లచెరువు ప్రాంతానికి చెందిన షేక్ ఖాజామొహిద్దీన్‌లను కలుపుకొని పథకం ప్రకారం గుంటూరులోని ఎంప్లాయీస్ కాలనీలో ఉన్న ఇమ్రాన్ అద్దె గదికి గోపిని జూన్ 24న ఫోన్ చేసి రప్పించారు. ముగ్గురు కలసి ఇనుపరాడ్డుతో గోపి తలపై కొట్టి ఆపై తాడుతో మెడకు ఉరివేసి హత్యచేశారు. మృతుడు గోపికి చెందిన కారు డిక్కీలో శవాన్ని చిలకలూరిపేటకు తీసుకువచ్చి ఇక్కడ పెట్రోల్ బంకులో రెండు లీటర్ల పెట్రోల్ కొనుగోలు చేసి గుంటూరు రోడ్డులో తిమ్మాపురం దాటిన తర్వాత యడ్లపాడు సమీపంలో సర్వీస్ రోడ్డు పక్కన సిమెంట్ కాల్వలో గోపీ మృతదేహాన్ని వేసి పెట్రోలు పోసి తగలబెట్టి పరారయ్యారు. యడ్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి గోపికి చెందిన కారు, కీ పాడ్ ఫోన్, సెల్‌ఫోన్, ఏటీఎం కార్డులు, రూ.12వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన చిలకలూరిపేట రూరల్ సీఐ బి సుబ్బానాయుడు, యడ్లపాడు ఎస్‌ఐ టి శివరామకృష్ణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

గ్రామాల్లో ఫ్యాక్షన్‌ను ప్రోత్సహిస్తున్న టీడీపీ నాయకులు

- దాడులకు భయపడేది లేదు
- అధికారంలోకి రాగానే బదులు తీర్చుకుంటాం
- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



చల్లా అంజిరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, డాక్టర్ అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: కొంత మంది వ్యక్తులకు డబ్బులు ఇచ్చి గ్రామాల్లో ఫ్యాక్షన్ పెంచాలని టీడీపీ నాయకులు చూస్తున్నారని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి విమర్శించారు. ఇటీవల టీడీపీ మూకల దాడిలో గాయపడి పట్టణంలోని పల్నాడు హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న చల్లా అంజిరెడ్డిని మహేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త చింతలపూడి అశోక్‌కుమార్‌లు మంగళవారం పరామర్శించారు. మహేష్‌రెడ్డి మాట్లాడుతూ జూలకల్లు గ్రామంలో పటిష్టంగా ఉన్న వైఎస్సార్ సీపీని దెబ్బతీయాలని, అలజడి సృష్టించాలని చూస్తున్నారని అన్నారు. ఏడాదిన్నరలో అంజిరెడ్డి, వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డిలపై దాడులు చేశారని తెలిపారు. నారు తీసుకొని వచ్చేందుకు వెళ్తే దారి కాచి అంజిరెడ్డిపై దాడి చేశారని తెలిపారు. గ్రామంలో కొంతమంది అలగా జనం చేస్తున్నారని, దీనికి తెలుగుదేశం పార్టీకి సంబంధం లేదని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారని, ప్రభుత్వం మారగానే ఎవరికి సంబంధం ఉందో తెలుస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులను నాలుగు, ఐదుసార్లు ఆసుపత్రి చుట్టూ తిప్పుదామని అనుకుంటే రేపు ప్రభుత్వం మారితే 40సార్లు ఆసుపత్రి చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. నేడు 20 ఎకరాలు బీడులుగా పెడితే రేపు 200, 300 ఎకరాలు బీడు పెట్టాల్సిన పరిస్థితులు వస్తాయని పేర్కొన్నారు. గెలుపోటములు సహజమని, గ్రామాల్లో మళ్లీ ఫ్యాక్షన్ తెవాలని చూస్తే అది మీ కర్మ అని అన్నారు. పోలీసు ఇప్పటికైనా శాంతియుతంగా ఉండేలా చూడాలని, కొట్టిన వారే గ్రామాల్లో గొడ్డళ్లు పట్టుకొని తిరుగుతున్నారని అన్నారు. దాడులకు భయపడేది లేదని జూలకల్లు గ్రామంలో పార్టీని మరింత పటిష్ట పరుస్తామని కాసు అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, పట్టణ కన్వీనర్ మాదాల కిరణ్‌కుమార్, ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి, ఎన్‌డీఎల్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కో ఆర్డినేటర్ మట్టారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనూ ఉత్తమ భవిష్యత్తు

- ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు
- వర్సిటీలో అంతర కళాశాలల పురుషుల కబడ్డీ పోటీలు ప్రారంభం

పెదకాకాని(ఏఎన్‌యు): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం అంతర కళాశాలల పురుషుల కబడ్డీ క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల ప్రారంభోత్సవంలో వీసీ ఆచార్య కె.గంగాధరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మనిషికి చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా మనిషి ఎదుగుదల, వికాసం, శరీరక ధృఢత్వానికి దోహదపడతాయన్నారు. ప్రస్తుత కాలంలో తల్లిదండ్రులు క్రీడలను అశ్రద్ధ చేయడం వలన పిల్లలు క్రీడలకు దూరం అవుతున్నారన్నారు. క్రీడా నైపుణ్యాలు, క్రీడాకారులు సామర్థ్యం, క్రీడల విశిష్టతను కొనియాడారు. వర్సిటీ ఆర్ట్స్, లా ప్రిన్సిపాల్, టోర్నమెంట్ ప్రెసిడెంట్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్, రెక్టార్ ఆచార్య ఆర్ శివ రాంప్రసాద్, రిజిస్ట్రార్ జి.సింహాచలం, డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్ పాల్గొన్నారు. కమిటీ మెంబర్లుగా డాక్టర్ పి.శ్రీనివాసరావు, పి.గణేష్, కె.ప్రసన్నకుమార్‌లు వ్యవహరించారు. ఏఎన్‌యూ పరిధిలోని 21 కళాశాలల జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయి.

సాంకేతికత జోడింపుతో ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి

పెదకాకాని(ఏఎన్‌యు): రాష్ట్రంలో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో 36వ దక్షిణ మండల జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు, ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల విధానంలో నూతన అధ్యాయం ప్రారంభమైందన్నారు. ఆధునిక సాంకేతికతను క్రీడల రంగానికి జోడించడం ద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రభుత్వానికి సమాంతరంగా పలు అథ్లెటిక్ అసోసియేషన్లు, మల్టీ నేషనల్ కంపెనీలు క్రీడలను ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. తొలుత అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పతాకాన్ని మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ పతాకాన్ని శాప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, లక్షద్వీప్, పుదుచ్చేరి, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ లా బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యునిగా నర్రా



నాదెండ్ల: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లాబోర్డు ఆఫ్ స్టడీస్ (అండర్ గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్) సభ్యునిగా సాతులూరు గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏఎన్‌యూ డిప్యూటీ రిజిస్ట్రార్ కె రంగారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన న్యాయశాస్త్రంలో డిగ్రీ, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ విభాగంలో సిలబస్, ఇతర అంశాల నిర్ణయాలకుగాను తొమ్మిది మంది సభ్యులతో వైస్‌ఛాన్సలర్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఏర్పాటు చేశారు. ఈయన ఏఎన్‌యూ పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా, హైకోర్టు న్యాయవాదిగా, అఖిల భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ప్రస్తుతం సేవలందిస్తున్నారు. న్యాయ విద్యార్థులు, న్యాయవాదులకు తరచూ అనేక అంశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈయన వద్ద శిక్షణ పొందిన అనేక మంది న్యాయమూర్తులుగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా, ప్రభుత్వ విభాగాల్లో న్యాయసలహాదారులుగా సేవలందిస్తున్నారు. ఇప్పటికే ఏఎన్‌యూ న్యాయసలహాదారుగా వ్యవహరిస్తున్నారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగిపై కేసు నమోదు

చిలకలూరిపేటటౌన్: ఫోన్‌లో మెసేజ్‌లు పెడుతూ వివాహితను వేధింపులకు గురి చేస్తున్న పురపాలక సంఘం కాంట్రాక్ట్ ఉద్యోగిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరా లప్రకారం...పట్టణంలోని భావనరుషినగర్‌లో నివాసం ఉంటున్న అవ్వారు రమేష్ తన ఇంటి పక్కనే ఉంటున్న వివాహితకు కొంతకాలంగా ఇబ్బందికరమైన మెసేజ్‌లను పెడుతున్నాడు. ఆమె పోలీసులకు ఫిర్యా దు చేసింది. మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇద్దరి నివాసాలు పక్కపక్కనే ఉండటం వల్ల పరిచయం ఏర్పడిందని, దానిని అడ్డు పెట్టుకొని రమేష్ ఈ వేధింపులకు పాల్పడుతున్నాడని బాధితురాలు వెల్లడించింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.